జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..
https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 145 08-6-2026 వెల: రూ.2/- పేజీలు: 06



విలేకరులు కావలెను
జాతీయ దిన పత్రిక తొలివెలుగు మన భాష.. మన పత్రిక..
www.epaper.tholivelugu.com
Contacts
తెలంగాణ
94911 34365
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో
తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.



# మా పోరాటం ఆగదు

- ధర్మేంద్ర ప్రధాన్ పదవి నుంచి దిగిపోవాల్సిందే
- విద్యా వ్యవస్థలో సమూల మార్పు కోసం ఎజెండా రూపొందిస్తాం
- కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే వెల్లడి

ఛత్రపతి శంభాజీనగర్: జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల్లో అవకతవకల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించాల్సిన బాధ్యత ప్రధాని నరేంద్ర మోదీపై ఉందని కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే తేల్చిచెప్పారు. ధర్మేంద్ర ప్రధాన్ పదవి నుంచి తప్పుకొనేదాకా తమ పోరాటం ఆగదని పేర్కొన్నారు. ఆదివారం మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో అభిజిత్ దీప్కే మీడియాతో మాట్లాడారు. దేశంలో గత 12 ఏళ్లుగా రాజకీయాలు కేవలం హిందూ--ముస్లిం ఎజెండా చుట్టూ తిరుగుతున్నాయని ఆక్షేపించారు. ప్రభుత్వ ప్రాధాన్యతలు ఇప్పటికైనా మారాలని, నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన తర్వాత దేశంలో విద్యా వ్యవస్థలో సమూల మార్పు కోసం ఎజెండాను రూపొందిస్తామని పేర్కొన్నారు. ఆదివారం ఉదయం ఛత్రపతి శంభాజీనగర్‌లోని




## భూ రికార్డుల భద్రతకు దేశంలోనే తొలిసారిగా
# బ్లాక్‌చైన్ టెక్నాలజీ వినియోగం



- పశ్చిమ గోదావరి జిల్లా సిద్ధాంతంలో సీఎం చంద్రబాబు పర్యటన
- 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ
- గడిచిన 6 నెలల్లో 26.46 లక్షల పాస్‌పుస్తకాలు అందజేసిన ప్రభుత్వం
- రైతులతో భేటీ అనంతరం పార్టీ శ్రేణులతో సమీక్ష నిర్వహించనున్న సీఎం

ముఖ్యమంత్రి చంద్రబాబు పశ్చిమ గోదావరి జిల్లాలో పర్యటించనున్నారు. భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. ఆచంట నియోజకవర్గంలోని సిద్ధాంతం గ్రామంలో జరిగే ఈ సభలో రైతులకు కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలను ముఖ్యమంత్రి స్వయంగా అందజేస్తారు. అనంతరం రైతులతో

# అభివృద్ధికి కలసిరండి

## హైదరాబాద్ అంతర్జాతీయ నగరమని చెప్పుకుంటే సరిపోతుందా?

**ఆ మేరకు అభివృద్ధి జరగాలి.. మూసీలో మురికి వల్లే ఈ భూములకు విలువ లేదు**

**కొడంగల్‌లో ఓడిపోయాక, మల్కాజిగిరిలో ఆశీర్వదించి ఎంపీగా గెలిపించారు**

**కిషన్‌రెడ్డి గారూ అనుమతులు తెండి.. గండపెండేరం తొడుగుతామని వెల్లడి**



హైదరాబాద్: 'మల్కాజిగిరి ఎంపీగా గెలిపించినప్పుడు వేరే ప్రభుత్వం ఉన్నందున మీరు ఆశించిన అభివృద్ధి చేయలేకపోయాను. కానీ ఇప్పుడు సీఎంగా ఉన్నా. రాజకీయాలకతీతంగా ఎన్ని నిధులైనా, ఎన్ని అనుమతులైనా ఇచ్చే బాధ్యత నాది. రోడ్లు, తాగునీరు, చెరువుల పునరుద్ధరణ, సుందరీకరణ, మెట్రో విస్తరణ తదితరమైనవి ఏవి కావాలన్నా చేసేందుకు సిద్ధంగా ఉన్నా. అన్ని రాజకీయపార్టీల ప్రతినిధులకు సూచిస్తున్నా. ఎన్నికలప్పుడే రాజకీయాలు చేద్దాం. కావాల్సినవి అడిగి సాధించుకోండి' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కొడంగల్‌లో ఓడిపోయాక,

- మిగతా 2వ పేజీలో

## రేవంత్ 'హిట్లర్' వ్యాఖ్యలపై కేటీఆర్ కౌంటర్




2లో

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజం
- మీకు హిట్లరే స్ఫూర్తి అంటూ ఎద్దేవా
- మీ హంతక ఏజెన్సీ పేరు హైడ్రా అని విమర్శ
- తమ పాలన అంబేద్కర్, గాంధీ ఆశయాలకు అనుగుణమని వెల్లడి
- బెంగళూరులో రేవంత్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా పోస్ట్

## గోదావరి-కావేరి లింక్‌పై రేవంత్ సర్కార్ జలద్రోహం

**పాలమూరు ప్రాజెక్టుకు ఎన్ఓసీ పేరుతో రాష్ట్ర జల హక్కులను తాకట్టు పెడుతున్నారు**

**అవసరమైతే ఢిల్లీలో ధర్నాలు, అఖిలపక్ష పోరాటానికి బీఆర్ఎస్ సిద్ధం: హరీశ్‌రావు**



హైదరాబాద్: గోదావరి--నల్లమల సాగర్ ప్రాజెక్టును పాలమూరు ప్రాజెక్టుతో ముడిపెట్టడం తెలంగాణ జలహక్కులను కాలరాయడమేనని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ హరీశ్‌రావు అన్నారు. సమాధానం చెప్పలేని పరిస్థితుల్లోనే సీఎం రేవంత్‌రెడ్డి వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని మండిపడ్డారు. రాజకీయ ప్రయోజనాల కంటే రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని, తెలంగాణ హక్కుల కోసం ముందుండి



## ఏపీలో రేర్ ఎర్త్ హబ్..

- మాస్కోలో రష్యా రేర్ ఎర్త్ సంస్థ 'గిరెడ్‌మెట్'తో మంత్రి నారా లోకేష్ భేటీ
- ఉత్తరాంధ్రలో రేర్ ఎర్త్ రిఫైనింగ్ హబ్ ఏర్పాటుకు ప్రతిపాదన
- నెల్లూరులో నియోడైమియం మాగ్నెట్ల తయారీ కేంద్రంపై చర్చలు
- భారత ఈవీ, పవన విద్యుత్ మార్కెట్లే లక్ష్యంగా ప్రాజెక్టులు
- మాస్కోలోని అణుశక్తి మ్యూజియాన్ని సందర్శించిన లోకేష్

## రేవంత్ రెడ్డికి కూడా అదే గతి పడుతుంది: కిషన్ రెడ్డి

- రేవంత్ రెడ్డి కూడా కేసీఆర్ బాటలోనే పయనిస్తున్నారని విమర్శలు
- కేసీఆర్‌ను ప్రజలు ఫామ్‌హౌస్‌కే పరిమితం చేశారని వ్యాఖ్య
- విదేశీ వ్యామోహంతో ప్రజల సమస్యలు మరచిన రేవంత్‌కు అదే గతి తప్పదన్న కిషన్ రెడ్డి
- తెలంగాణలో పాలన మారినా ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదని విమర్శ

2లో



### పవన్ కళ్యాణ్ సంచలన నిర్ణయం..

## ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన కమిటీ రద్దు

- నాయకుల మధ్య విభేదాలు, క్రమశిక్షణ లోపించడమే కారణం
- ఈ మేరకు నిర్ణయం తీసుకున్న జనసేన అధినేత పవన్ కళ్యాణ్
- ప్రకాశం జిల్లా తర్వాత నెల్లూరు కమిటీపై వేటు
- కొత్త కమిటీ నియామకం వరకు కేంద్ర కార్యాలయం పర్యవేక్షణ

2లో



## తప్పుడు ప్రచారాలు మానండి..

- రైతులకు ఉచిత కరెంట్ ఆగదు
- తప్పుడు ప్రచారాలపై భట్టి ఫైర్
- రైతులకు ఉచిత కరెంట్ కొనసాగింపు
- విద్యుత్ సిబ్బందికి రూ. కోటి బీమా
- 20 రోజుల్లో సమస్యల పరిష్కారం

2లో



# మా పోరాటం ఆగదు

(మొదటి పేజీ తరువాయి)

సొంత ఇంటికి చేరుకున్న అభిజిత్ దీప్కేకు ఘన స్వాగతం లభించింది. కుటుంబ సభ్యులు ఆయనకు స్వాగతం పలికారు. రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధాన్ని ఆపగలిగే శక్తి ఉన్న ప్రధాని మోదీ మన దేశంలో పేపర్ లీక్‌ను ఆపలేరా అని దీప్కే ప్రశ్నించారు. జెన్ జెడ్ యువత ఎవరికీ భయపడబోరన్న సంగతి శనివారం నాటి జంతర్‌మంతర్ ధర్నాతో తెలిసిపోయిందన్నారు. తప్పులు జరిగితే యువత ప్రశ్నిస్తూనే ఉంటుందని ఉద్ఘాటించారు. ఈ ధర్నాకు 7,000 మంది హాజరయ్యారని, తమ ఉద్యమం ఇక దేశవ్యాప్తంగా విస్తరిస్తుందని స్పష్టంచేశారు. త్వరలోనే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. నీట్--యూజీ పేపర్ లీక్ వల్ల లక్షల మంది నష్టపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. ఎవరూ బాధ్యత తీసుకోకపోతే వ్యవస్థ సక్రమంగా ఎలా పనిచేస్తుందని ప్రశ్నించారు. దీప్కే ఇంటి వద్ద పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు.

# ఏపీలో రేర్ ఎర్త్ హబ్..

రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రష్యాలో పర్యటిస్తున్న ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్, మాస్కోలో కీలక సమావేశంలో పాల్గొన్నారు. రష్యాకు చెందిన ప్రముఖ రేర్ ఎర్త్ ఖనిజాల సంస్థ 'గిరెడ్‌మెట్ ఇనిస్టిట్యూట్' ప్రతినిధులతో ఆయన భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో రెండు కీలక ప్రాజెక్టుల ఏర్పాటుకు గల అవకాశాలపై ఈ సమావేశంలో చర్చించారు. ఉత్తరాంధ్రలోని విశాఖపట్నం, శ్రీకాకుళం ప్రాంతాల్లో లభించే భారీ ఖనిజ వనరులను ఉపయోగించుకుని, ఒక డీప్ ప్రాసెసింగ్, రేర్ ఎర్త్ ఎలిమెంట్ (ఆర్ఈఈ) రిఫైనింగ్ హబ్‌ను ఏర్పాటు చేయాలని మంత్రి లోకేష్ ప్రతిపాదించారు. అలాగే, భారతదేశంలో వేగంగా విస్తరిస్తున్న ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ), పవన విద్యుత్ మార్కెట్ల అవసరాలను తీర్చేందుకు గిరెడ్‌మెట్ సాంకేతికతతో నెల్లూరులో నియోడైమియం మాగ్నెట్ ఉత్పత్తి కేంద్రాన్ని నెలకొల్పేందుకు భాగస్వామ్యం కావాలని కోరారు.

# పవన్ కల్యాణ్ సంచలన నిర్ణయం..
# ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన కమిటీ రద్దు

జనసేన పార్టీలో ప్రక్షాళన దిశగా అధినేత పవన్ కల్యాణ్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని పార్టీ కమిటీలన్నింటినీ రద్దు చేస్తూ కీలక ఆదేశాలు జారీ చేశారు. జిల్లా, నగర, మండల, గ్రామ స్థాయి కమిటీలను రద్దు చేస్తున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ ఆదేశాలు తక్షణమే అమల్లోకి వస్తాయని తెలిపారు. నెల్లూరు జిల్లాలో నాయకుల మధ్య తీవ్రమైన విభేదాలు, క్రమశిక్షణారాహిత్యం పెరిగిపోయిందని పార్టీ అధిష్ఠానం దృష్టికి వచ్చినట్లు తెలుస్తోంది. నాయకులు పార్టీ విధానాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని, వారి వైఖరి వల్ల కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జన సైనికులు, పార్టీ మద్దతుదారుల నుంచి ఫిర్యాదులు అందాయని పవన్ కల్యాణ్ తన ప్రకటనలో పేర్కొన్నారు. "క్రమశిక్షణ లేని చోట వ్యవస్థను సక్రమంగా నిర్వహించలేం. అందుకే ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది" అని పవన్ వివరించారు.

# చేనేత 'ఇక్కత్' వస్త్రాలకు విస్తృత ప్రచారం

- మెట్రో నగరాల ఎగ్జిబిషన్లతోనే కళాకారులకు మేలు
- ఘనంగా ముగిసిన 'థ్రెడ్ టు పోచంపల్లి' ప్రదర్శన
- కుటుంబ సమేతంగా హాజరై వస్త్రాలు కొనుగోలు చేసిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి





**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** ప్రపంచ ప్రసిద్ధి గాంచిన పోచంపల్లి చేనేత ఇక్కత్ వస్త్రాలకు అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో విస్తృత ప్రచారం కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని భువనగిరి శాసనసభ్యుడు కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. హైటెక్స్ వేదికగా ఈనెల 5వ తేదీ నుండి నిర్వహిస్తున్న 'థ్రెడ్ టు పోచంపల్లి' ఎగ్జిబిషన్ ముగింపు వేడుకలు ఆదివారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ ముగింపు సమావేశానికి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ఎగ్జిబిషన్‌లోని వివిధ చేనేత స్టాళ్లను సందర్శించి, నేతన్నల నైపుణ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు చేనేత వస్త్రాలను కొనుగోలు చేశారు. ?ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు సభలో ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. సాంప్రదాయ చేనేత కలకు ఊతమిచ్చేలా మెట్రో నగరాలలో ఇలాంటి ప్రదర్శనలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. దీనివల్ల చేనేత కళాకారుల ఉత్పత్తులకు మంచి గిరాకీ లభించడంతో పాటు ఉపాధి అవకాశాలు మరింత మెరుగవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. తరతరాలుగా వస్తున్న సాంప్రదాయ చేనేత కళను నమ్ముకుని జీవిస్తున్న కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా నేతన్నల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అన్ని రకాల సంక్షేమ పథకాలను చేనేత కార్మికులకు అందిస్తామని స్పష్టం చేశారు. నేతన్నలకు భరోసా ఇచ్చేందుకు ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించాలని పిలుపునిచ్చారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ భాస్కరరావుతో కలిసి ఎగ్జిబిషన్‌లో స్టాళ్లు ఏర్పాటు చేసిన నిర్వాహకులకు, చేనేత కళాకారులకు, అధికారులకు ఎమ్మెల్యే ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహీతలు గజం అంజయ్య, గజం గోవర్ధన్, భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి, జడ్పీ సీఈవో శోభారాణి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, చేనేత జౌళి శాఖ జిల్లా సహాయ సంచాలకులు శ్రీనివాస్, అసిస్టెంట్ డీఆర్‌డీఓ జంగారెడ్డి, మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, టై అండ్ డై సంఘం అధ్యక్షుడు కర్నాటి బాలరాజు, జాతీయ చేనేత అవార్డు గ్రహీత తడక రమేష్, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రాం నరసింహ, ఈపురి ముత్యాలు పాల్గొన్నారు.

# అభివృద్ధికి కలసిరండి

(మొదటి పేజీ తరువాయి)

రాజకీయంగా ఎదురుదెబ్బ తగిలిన సమయంలో మల్కాజిగిరిలో ఆశీర్వదించి ఎంపీగా గెలిపించారన్నారు. అక్కడి నుంచే సీఎం వరకు రాగలిగానన్నారు. హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరంగా అభివృద్ధి చేసేందుకు రాజకీయాల కతీతంగా సహకరించాలని కోరారు. శనివారం ఉప్పల్ భగాయత్ లేఔట్ ఫేజ్--3లో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ భవనం, టీకేఆర్ జంక్షన్ ఫ్లైఓవర్, ఏఓసీ సెంటర్ చుట్టూ ప్రత్యామ్నాయ రహదారులు, వంద పడకల ఆస్పత్రి పనులకు శంకుస్థాపనల శిలాఫలకాలను రేవంత్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉప్పల్ భగాయత్‌లో నిర్వహించిన బహిరంగసభలో ఆయన మాట్లాడారు. రాజకీయ స్వార్థం, ఎన్నికల లబ్ధి కోసం మూడు కార్పొరేషన్లు చేశానని కొందరంటున్నారు కానీ, పరిపాలన సౌలభ్యం, అన్ని ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం కోసం చేశానని తెలిపారు. క్యూర్ పరిధిలోని 2,100 చదరపు కిలోమీటర్ల పరిధిలో నివసిస్తున్న 1.34 కోట్లమంది ప్రజల సదుపాయాల కోసం జీహెచ్ఎంసీ, ఎంఎంసీ, సీఎంసీ కార్పొరేషన్లుగా, అదే మాదిరిగా పోలీసు వ్యవస్థను వికేంద్రీకరించినట్లు చెప్పారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్‌ను పదెకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిచుకుంటున్నామని, రూ. 1,511 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు చెప్పారు.

**కనీస కనికరం ఉండొద్దా?**

'గుజరాత్ అహ్మదాబాద్‌లో సబర్మతి రివర్‌ఫ్రంట్, ఢిల్లీలో యమునానది, యూపీలో గంగానది రివర్‌ఫ్రంట్‌ను మీరు అభివృద్ధి చేసుకోవచ్చు కానీ.. మనం మూసీనది ప్రక్షాళన చేయొద్దా? అని అడ్డంపడుతున్న వారిని అడుగుతున్నా' అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు, 55 కి.మీ. ప్రక్షాళన చేసి మూసీని అంతర్జాతీయస్థాయిలో అభివృద్ధి చేసి తీరతానన్నారు. 'న్యూయార్క్, న్యూజెర్సీ మధ్యనున్న రివర్‌ఫ్రంట్ దగ్గర ఒక్కో అపార్ట్‌మెంట్ వందల కోట్ల విలువ ఉంది. ఇక్కడ మురికి వల్లే ఈ భూములకు విలువ లేదు. ఇక్కడ ప్రజలు నివసించడం లేదు. నల్లగొండ ప్రజలను కాలుష్యం కాటేస్తుంటే కనికరం చూపాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా' అని చెప్పారు. ఆలేరు, భువనగిరి, ప్రాంతాల్లోని ప్రజలు కొత్తగా పెళ్లయిన వారికి గర్భధారణ సమస్యలొస్తాయని, కలుషిత నీరు, ఆహారంతో కడుపుకోతకు గురవుతారని పట్టణానికి పంపిస్తున్నారన్నారు. ఫ్లోరైడ్, మూసీ కాలుష్యం, చచ్చిన శవాల కళేబరాలు కొట్టుకువస్తుంటే, అక్కడి ప్రజలు ప్రక్షాళన చేయాలని కోరారని చెప్పారు. నాగోల్ నుంచి నేరుగా శంషాబాద్ విమానాశ్రయం వెళ్లేందుకు నాగోల్ జంక్షన్--ఎల్బీనగర్--ఒవైసీ హాస్పిటల్--చాంద్రాయణగుట్ట--రాజేంద్రనగర్--ఎయిర్‌పోర్ట్ వరకు మెట్రో విస్తరణ చేయాల్సిందేనన్నారు. అంతేకాదు, ఎల్బీనగర్ -- హయత్‌నగర్ వరకు కూడా చేయాలన్నారు. మెట్రోను 122 కి.మీ. వరకు పొడిగించాల్సి ఉందన్నారు. అంతర్జాతీయనగరం చేయాలని తాను ప్రయత్నిస్తుంటే, అన్ని అనుమతులొచ్చాక , ఇక్కడి నుంచి మంత్రిగా చేస్తున్నాయన పోయి పుల్లలు పెట్టి అర్ధంతరంగా ఆపారని ఆరోపించారు. ఓఆర్ఆర్ వచ్చినందుకు అంతర్జాతీయ నగరంగా మారిందని.. రీజినల్ రింగ్‌రోడ్ వస్తే 360 కిలోమీటర్ల అభివృద్ధి జరిగితే, ప్రపంచంలోనే పోటీపడే సింగపూర్, టోక్యో, న్యూయార్క్‌లాంటి నగరాలతో హైదరాబాద్ పోటీ పడుతుందన్నారు. అంతర్జాతీయ నగరమని చెప్పుకుంటే సరిపోదని, ఆమేరకు అభివృద్ధి జరగాలన్నారు. జెడ్పీటీసీ నుంచి తాను ఈ స్థాయికి ఎదగడానికి ఆడబిడ్డలే కారణమని, తన ప్రతిసభలో వారికి ముందు కూర్చునే అవకాశం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్యూర్--1 యాప్‌ను సీఎం ప్రారంభించారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌కు బండారి రాజిరెడ్డిపేరు పెట్టామని, చౌరస్తాలో విగ్రహం కూడా ఏర్పాటు చేస్తామన్నారు. 'హైదరాబాద్‌కు రెండో దశ మెట్రో రావాల్సిందే. ట్రిపుల్ ఆర్‌కు అనుమతులివ్వాల్సిందే. మూసీ ప్రక్షాళన జరగాల్సిందే. రాష్ట్రంలో పండించిన పంటలను మొత్తం కొనాల్సిందే.

# తప్పుడు ప్రచారాలు మానండి..

ప్రతిపక్షాలు అధికార కాంగ్రెస్ పార్టీ , ప్రభుత్వంపై కావాలనే తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి (డిప్యూటీ సీఎం) మల్లు భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఖమ్మంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాలకు ఒక బహిరంగ సవాలు విసిరారు. ప్రజలకు తప్పుడు సమాచారం ఇస్తూ, అబద్ధపు ప్రచారాలతో ఇంకా ఎన్ని సంవత్సరాలు రాజకీయ పబ్బం గడుపుకుంటారని ఆయన నిలదీశారు. తాము చేస్తున్నవన్నీ తప్పుడు ప్రచారాలేనని ఒప్పుకుంటూ రాష్ట్ర ప్రజలకు ప్రతిపక్షాలు వెంటనే క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులకు తప్పుడు సమాచారం ఇస్తూ వారిని మోసం చేయవద్దని భట్టి విక్రమార్క ప్రతిపక్షాలను హెచ్చరించారు. తమ ప్రభుత్వం అత్యంత నిబద్ధతతో పనిచేస్తోందని ఆయన స్పష్టం చేశారు. వ్యవసాయ రంగానికి నిరంతరం ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, భవిష్యత్తులో కూడా దీనిని ఇలాగే కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. రైతులకు కేవలం కరెంట్ ఇవ్వడమే కాకుండా, ఎంతో జాగ్రత్తలు తీసుకుంటూ అత్యంత నాణ్యమైన విద్యుత్‌ను (క్వాలిటీ పవర్) సరఫరా చేస్తున్నామని, రాబోయే రోజుల్లో కూడా ఈ నాణ్యతలో ఎలాంటి లోటు రానివ్వమని భరోసా ఇచ్చారు. తాము మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని చెప్తూ మాయమాటలు చెప్పే అలవాటు తమకు లేదన్నారు.

# గోదావరి–కావేరి లింక్‌పై రేవంత్ సర్కార్ జలద్రోహం

పోరాడేది బీఆర్ఎస్ మాత్రమేనని స్పష్టం చేశారు. తెలంగాణభవన్‌లో ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వంపై హరీశ్‌రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గోదావరి--బనకచర్ల ప్రాజెక్టుపై బీఆర్ఎస్ నిరంతరం పోరాడిందని హరీశ్‌రావు గుర్తు చేశారు. జీడబ్ల్యూడీటీ (గోదావరి జలాల వివాదాల ట్రిబ్యునల్) అవార్డు ప్రకారం గోదావరి నీటిని కృష్ణా పరీవాహక ప్రాంతానికి మళ్లిస్తే తెలంగాణకు 45 టీఎంసీల అదనపు హక్కు ఉంటుందని తాము ముందుగానే హెచ్చరించామన్నారు. నదుల అనుసంధానంపై జరిగిన ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశాల్లో తెలంగాణకు కేటాయించిన 968 టీఎంసీల ప్రాజెక్టులకు పూర్తి అనుమతులు వచ్?చన తర్వాతే తదుపరి చర్చలు జరగాలని పట్టుబట్టామని వెల్లడించారు. అనుసంధానంలో తరలించే నీటిలో 50 శాతం తెలంగాణకు ఇవ్వాలని, ఇచ్చంపల్లి లేదా సమ్మక్కసాగర్ నుంచి నాగార్జునసాగర్‌కు లింక్ ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. ప్రస్తుతం పోలవరం నుంచి నల్లమలసాగర్, అక్కడి నుంచి కావేరికి నీటిని తరలించే ప్రతిపాదనలో తెలంగాణకు ఎలాంటి ప్రయోజనం లేదని విమర్శించారు. పాలమూరు ప్రాజెక్టుకు కేటాయించిన 90 టీఎంసీలను ఎన్‌ఓసీతో ముడిపెట్టడం ప్రమాదకరమని హరీశ్‌రావు అన్నారు. తెలంగాణకు ట్రిబ్యునల్ ద్వారా రావాల్సిన 1,005 టీఎంసీలతోపాటు మరో 45 టీఎంసీల అంశం పెండింగ్‌లో ఉండగా రాష్ట్ర ప్రయోజనాలను ప్రభుత్వం వదులుకుంటోందని ఆరోపించారు.

# రేవంత్ 'హిట్లర్' వ్యాఖ్యలపై కేటీఆర్ కౌంటర్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రేవంత్ రెడ్డికి హిట్లరే స్ఫూర్తి అని, ఆయన నియంతలను పూజిస్తారని ఆరోపించారు. నిన్న బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఉటంకిస్తూ కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "మీ స్ఫూర్తి హిట్లర్! మీ హంతక ఏజెన్సీ పేరు హైడ్రా! మీరు నియంతలను పూజిస్తూ, కూల్చివేతల గురించి గొప్పగా చెప్పుకుంటున్నారు" అని కేటీఆర్ తన పోస్టులో ఘాటుగా విమర్శించారు. "మేం మీ అంత తెలివైన వాళ్లం కాదు రేవంత్! అందుకే మేం అంబేద్కర్ రాజ్యాంగం, గాంధీజీ దార్శనికత, ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని పాలించాం" అని పేర్కొన్నారు. నిన్న బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, హైడ్రా పేరు వెనుక తనకు స్ఫూర్తి హిట్లర్ అని వెల్లడించారు. హిట్లర్ కు హైడ్రా అనే టీమ్ ఉండేదని, హిట్లర్ ప్రత్యర్థుల పనిబట్టడమే ఆ టీమ్ పని అని పేర్కొన్నారు. రేవంత్ చేసిన ఈ వ్యాఖ్యలపై దుమారం రేగుతోంది.

## రేవంత్ రెడ్డికి కూడా అదే గతి పడుతుంది: కిషన్ రెడ్డి



తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పట్టిన గతే ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డికి కూడా పడుతుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ అబద్ధపు హామీలు, అసమర్థ పాలనతో ప్రజాగ్రహానికి గురై ఫామ్‌హౌస్‌కు పరిమితమయ్యారని, ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా అదే బాటలో నడుస్తూ ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో అధికారం మారినా ప్రజల ఆకాంక్షలు మాత్రం నెరవేరడం లేదని విమర్శించారు. అడ్డగోలు హామీలు, నమ్మకద్రోహంతో క్షేత్రస్థాయి సమస్యలను గాలికొదిలేశారని మండిపడ్డారు. సొంత దేశంలో జరుగుతున్న అభివృద్ధిపై విమర్శలు చేస్తూ, విదేశాలపై వ్యామోహం చూపించడం ఇద్దరు ముఖ్యమంత్రుల్లోనూ చూశామని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా విదేశీ భాషలో మాట్లాడుతున్న రేవంత్ రెడ్డికి కూడా కేసీఆర్ కు పట్టిన గతే పడుతుందని కిషన్ రెడ్డి హెచ్చరించారు. చేతగాని పాలన అందిస్తున్న నేతల గ్రాఫ్ పాతాళానికి పడిపోవడం ఖాయమని ఆయన వ్యాఖ్యానించారు.

భూ రికార్డుల భద్రతకు దేశంలోనే తొలిసారిగా

# బ్లాక్‌చైన్ టెక్నాలజీ వినియోగం

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేకంగా సమావేశమై వారి అభిప్రాయాలు, సమస్యలు తెలుసుకుంటారు. గత ప్రభుత్వ హయాంలో జారీ చేసిన పాస్‌పుస్తకాల్లోని తప్పులను సరిదిద్ది, పారదర్శకమైన రీతిలో కొత్త పాస్‌పుస్తకాలను అందించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. రైతుల సమక్షంలోనే భూములను రీ-సర్వే చేసి, వారి ఆమోదం తర్వాతే తుది రికార్డులను సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రతీ నెలా ముఖ్యమంత్రి చంద్రబాబు నేరుగా రైతులతో సమావేశమై, వారి సమక్షంలోనే అధికారులతో భూ వివరాలను చదివించి పాస్‌పుస్తకాలను పంపిణీ చేస్తున్నారు.

**6 నెలల్లో 26.46 లక్షల పాస్‌పుస్తకాల పంపిణీ**

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, జనవరి నుంచి రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేసింది. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 6,688 గ్రామాల్లో రీ-సర్వే పూర్తి కాగా, అందులో 6,459 గ్రామాలకు చెందిన 26.46 లక్షల మంది రైతులకు కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలను ప్రభుత్వం అందించింది. రానున్న 9 నెలల్లో మరో 10,357 గ్రామాల్లో రీ-సర్వే పూర్తి చేసి, 67.32 లక్షల పాస్‌పుస్తకాలను పంపిణీ చేయాలని సీఎం లక్ష్యంగా నిర్దేశించారు. దదేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బ్లాక్‌చైన్ ఆధారిత భూ రికార్డుల వ్యవస్థను అమలు చేస్తోంది. దీని ద్వారా ప్రతీ భూ యూనిట్‌కు ఒక శాశ్వత బ్లాక్‌చైన్ ఐడీ కేటాయిస్తున్నారు. తద్వారా రికార్డులను తారుమారు చేయడం అసాధ్యం. సర్వే నుంచి తుది రికార్డు వరకు ప్రతి దశలోనూ రైతు ఈ-కేవైసీని తప్పనిసరి చేశారు. సోమవారం ఉదయం 10:25 గంటలకు అమరావతి నుంచి బయలుదేరనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, 11 గంటలకు సిద్ధాంతం గ్రామానికి చేరుకుంటారు. 11:15 గంటలకు 'మీ భూమి-మీ హక్కు' ప్రజా వేదిక సభలో పాల్గొంటారు.

# బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యం పంపిణీ

- మౌలానా మృతి పట్ల నిమ్మల శ్రీనివాస్‌గౌడ్ పరామర్శ
- వెల్దేవిలో బాధిత కుటుంబానికి ధైర్యం కల్పించిన నేతలు

**తొలివెలుగు, అడ్డగూడూరు:** మండలం వెల్దేవి గ్రామానికి చెందిన ఎస్కే మౌలానా ఇటీవల మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులను కాంటెస్ట్ సర్పంచ్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్ ఆదివారం పరామర్శించారు. మౌలానా మృతితో ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న విషయం తెలుసుకుని ఆయన వెల్దేవిలోని వారి నివాసానికి వెళ్లారు. మౌలానా కుటుంబ సభ్యులైన భాషని, షహరాజ్, ముజిబ్, షబ్బీర్‌లను కలిసి ఓదార్చారు. ఈ కష్టకాలంలో తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం మానవతా దృక్పథంతో ఆ బాధిత కుటుంబానికి తక్షణ సహాయం కింద 50 కేజీల బియ్యాన్ని నిమ్మల శ్రీనివాస్ గౌడ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వెల్దేవి గ్రామశాఖ అధ్యక్షుడు కుంభం సోమయ్య, వార్డు సభ్యులు కన్నెబోయిన సత్తయ్య, లోడే శోభ రవి, మాజీ ఉపసర్పంచ్ నిర్మల సైదులు పాల్గొన్నారు. అలాగే చిలుకూరి అర్జున్, లోడే యాదగిరి, వెంకన్నపిల్లి, మంటిపల్లి భద్రయ్య, కన్నెబోయిన గట్టయ్య, మంటిపల్లి నర్సయ్య, బోడ గణేష్, కన్నెబోయిన వీరమల్లు, చిలుకూరి వేణు, నిర్మాల వెంకటేశ్వర్లు, సోషల్ మీడియా ప్రతినిధి గోలి నర్సింహతో పాటు పలువురు గ్రామ సోషల్ మీడియా కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.





# యాదాద్రిలో వైభవంగా సుదర్శన నరసింహ హోమం

- వేదమంత్రాల మధ్య స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు
- తిరుమాడ వీధుల్లో వైభవంగా ఉత్సవమూర్తుల ఊరేగింపు
- పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న అర్చకులు, అధికారులు



**తొలివెలుగు, యాదగిరిగుట్ట:** యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం స్వామి, అమ్మవార్లకు సుదర్శన నరసింహ హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వీకెండ్ సెలవు దినం కావడంతో ఆలయానికి భక్తుల రద్దీ పెరిగిన నేపథ్యంలో, అర్చకులు ఉదయం నుంచే స్వామివారికి విశేష అర్చనలు, కైంకర్యాలు చేపట్టారు. ప్రాతఃకాలంలోనే గర్భాలయంలోని స్వామి, అమ్మవార్ల ప్రధాన మూర్తులకు, ఉత్సవమూర్తులకు పంచామృతాలతో అత్యంత వైభవంగా అభిషేకం గావించారు. అనంతరం స్వామివారికి, లక్ష్మీ అమ్మవారికి దివ్యమైన పట్టు వస్త్రాలను ధరింపజేసి, నానావిధ పరిమళ భరిత పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించారు. ముఖ్య పూజా కార్యక్రమాల్లో భాగంగా ఆలయ యాగశాలలో ప్రత్యేక హోమాలను నిర్వహించారు. లక్ష్మీ నారసింహ, సుదర్శన, గరుడ వంటి దేవతల మూలమంత్రాలను ఉచ్చరిస్తూ వేద పండితులు, అర్చక స్వాములు అత్యంత నిష్ఠతో హవనం పూర్తి చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను ప్రత్యేక సేవలో అధిష్ఠింపజేసి, ఆలయ తిరుమాడ వీధుల్లో వైభవంగా ఊరేగించారు. సాయంత్రం వేళలో లక్ష్మీ అమ్మవారిని ప్రత్యేక సేవపై ప్రతిష్ఠించి, మంగళ వాయిద్యాలు, భాజాభజంత్రీలు, వేద పండితుల వేదనాదాల మధ్య సుమారు గంట పాటు ఆలయ వీధుల్లో ప్రదక్షిణగా ఊరేగింపు సేవను నిర్వహించారు. ఈ విశేష పూజలను భక్తులు దర్శించుకుని తరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు నల్లంతీగల్ సురేంద్రాచార్యులు, ఉప ప్రధాన అర్చకులు కిరణ్‌కుమార్ ఆచార్యులు, శ్రీధరాచార్యులు, వజ్జల లక్ష్మణాచార్యులు, నరేష్ కుమార్ ఆచార్యులతో పాటు ఆలయ అధికారులు సురేందర్ రెడ్డి, చంద్రమౌళి, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల క్షేమం కోసమే సేంద్రీయ సాగు

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ఆదర్శ రైతు స్వరన్ పాల్ సింగ్ వెల్లడి
- తొమ్మిదేళ్లుగా పూర్తి సేంద్రీయ పద్ధతిలో పంటల సేద్యం
- రైతును అభినందించిన పలువురు ప్రముఖులు

**తొలివెలుగు, రాజాపేట:** పర్యావరణ పరిరక్షణ, నేల ఆరోగ్య సంరక్షణతో పాటు ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలనే లక్ష్యంతోనే తాను సేంద్రీయ వ్యవసాయాన్ని ఎంచుకున్నట్లు ఆదర్శ రైతు ఠాగూర్ స్వరన్ పాల్ సింగ్ తెలిపారు. ఇతర రైతులు కూడా రసాయన ఎరువులను వీడి సేంద్రీయ సాగు బాటలో నడవాలని ఆయన పిలుపునిచ్చారు. అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్ శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ఆయన మాట్లాడారు. గత తొమ్మిది సంవత్సరాలుగా తాను పండ్ల తోటల పెంపకంతో పాటు వ్యవసాయాన్ని కొనసాగిస్తున్నట్లు సీఎంకు వివరించారు. తన పొలంలో పూర్తి సేంద్రీయ పద్ధతిలోనే మామిడి, వివిధ రకాల కూరగాయలతో పాటు దేశవాళీ వరి రకాలను పండిస్తున్నట్లు పేర్కొన్నారు. సేంద్రీయ వ్యవసాయం ద్వారా నాణ్యమైన, విలువైన దిగుబడులు సాధించవచ్చన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ, హార్టికల్చర్ శాఖలు అందిస్తున్న ప్రోత్సాహం ఎంతో సంతోషకరమని, ముఖ్యంగా యువ రైతులను ఆదరిస్తున్న తీరు అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి సమక్షంలో తన సాగు అనుభవాలను పంచుకోవడం గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న పలువురు ప్రముఖులు స్వరన్ పాల్ సింగ్ సాగు పద్ధతులను ప్రత్యేకంగా అభినందించారు. యువత, తోటి రైతులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.



# గురువులే నా జీవితానికి మార్గదర్శకులు

- అమ్మనాన్న జన్మనిస్తే.. ఉపాధ్యాయులు జీవితాన్ని ప్రసాదించారు
- నాటి గురువుల ఆశయ సాధనకై ఉపాధ్యాయురాలిగా రజిత ప్రయాణం
- డీఎస్సీలో కొలువు సాధించి లక్ష్మక్కపల్లి పాఠశాలలో విధి నిర్వహణ

తొలివెలుగు, రాజాపేట: "మనిషి జీవితంలో కన్నతల్లిదండ్రులు జన్మనిస్తే, ఆ జీవితానికి ఒక అర్థాన్ని, దిశానిర్దేశాన్ని కల్పించేది మాత్రం గురువులే" అని రాజాపేట మండలం లక్ష్మక్కపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు ధీరవత్ రజిత అన్నారు. తన జీవితాన్ని ఉన్నత పథంలో నిలిపిన నాటి గురువులు శేఖర్ సార్, నిర్మల మేడమ్‌ల పాత్రను గుర్తుచేసుకుంటూ ఆమె తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తుర్కపల్లి మండలం దేవోజ్ తండాకు చెందిన ధీరవత్ మోతీరం, శాంతి దంపతుల కుమార్తె అయిన రజిత అత్యంత మారుమూల గ్రామంలో, సాధారణ కుటుంబంలో జన్మించారు. ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ఉన్నత లక్ష్యాలతో చదువుపై దృష్టి సారించి.. 2024 డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగాన్ని సాధించారు. ప్రస్తుతం ఆమె రాజాపేట మండలం లక్ష్మక్కపల్లి బడిలో ఎస్జీటీగా సేవలందిస్తున్నారు. బొమ్మలరామారం మండలం కందిళ్లకుంట తండాకు చెందిన శ్రీనుతో వివాహం జరగ్గా.. తన భర్త నుంచి లభిస్తున్న ప్రోత్సాహం మరువలేనిదని ఆమె కొనియాడారు.

**లక్ష్యం వైపు నడిపించారు..**

ఈ సందర్భంగా రజిత మాట్లాడుతూ.. "నన్ను కంటికి రెప్పలా పెంచిన నా తల్లిదండ్రులకు మొదటగా పాదాభివందనాలు. అయితే నేను ఈ రోజు సమాజంలో ఒక గౌరవప్రదమైన హోదాలో నిలబడటానికి కారణం నా గురువులు శేఖర్ సార్, నిర్మల మేడమ్. నాలోని ప్రతిభను గుర్తించి, నాపై నాకు నమ్మకం కలిగేలా చేసింది వారే" అని గుర్తుచేసుకున్నారు. పోటీ పరీక్షల ప్రిపరేషన్ సమయంలో నిరుత్సాహానికి గురైన ప్రతిసారీ వారు ధైర్యం చెప్పి లక్ష్యం వైపు నడిపించారని కొనియాడారు. తనకు ప్రభుత్వ ఉద్యోగం వచ్చిన రోజున తన తల్లిదండ్రుల కంటే ఎక్కువగా గురువులే సంతోషపడ్డారని, వారి కళ్లలో చూసిన ఆనందం జీవితాంతం గుర్తుండిపోతుందని భావోద్వేగంతో చెప్పారు. ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి చేరాలనే తపన శేఖర్ సార్‌దైతే.. విద్యార్థుల విజయాలను సొంత కుటుంబ విజయాలుగా భావించే అరుదైన గుణం నిర్మల మేడమ్‌దని ప్రశంసించారు. తన గురువుల మార్గదర్శకత్వంలోనే తాను కూడా ఉపాధ్యాయురాలిగా మరెందరో విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు నిరంతరం కృషి చేస్తానని రజిత స్పష్టం చేశారు.



# ప్రీ-ప్రైమరీ పాఠశాలల్లో ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

- రాజాపేట మండలంలో 8 పాఠశాలల్లో ఖాళీలు
- ఈ నెల 16వ తేదీ వరకు గడువు: మండల విద్యాధికారి చందా రమేష్
- గౌరవ వేతన ప్రాతిపదికన తాత్కాలిక నియామకాలు

**తొలివెలుగు, రాజాపేట:** మండల పరిధిలోని ప్రభుత్వ ప్రీ-ప్రైమరీ (పూర్వ ప్రాథమిక) పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టుల భర్తీకి ఆదివారం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు రాజాపేట మండల విద్యాధికారి (ఎంఈవో) చందా రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఎనిమిది ప్రభుత్వ పాఠశాలలకు గాను ప్రీ-ప్రైమరీ విభాగానికి ఒక ఇన్‌స్ట్రక్టర్, ఒక ఆయా పోస్టు చొప్పున ప్రభుత్వం మంజూరు చేసిందని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు, ఈ నెల 16వ తేదీ లోపు సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు దరఖాస్తులు సమర్పించాలని ఆయన సూచించారు. ఈ నియామకాలు పూర్తిగా తాత్కాలిక ప్రాతిపదికన ఉంటాయని, ప్రతి విద్యా సంవత్సరంలో 10 నెలల పాటు మాత్రమే గౌరవ వేతనం చెల్లించబడుతుందని స్పష్టం చేశారు.

**ఎంపిక కమిటీ - వేతన వివరాలు:**

ఈ నియామక ప్రక్రియను పారదర్శకంగా చేపట్టేందుకు నలుగురు సభ్యులతో కూడిన మండల స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు ఎంఈవో తెలిపారు. ఈ కమిటీలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో), మండల విద్యాధికారి (ఎంఈవో), కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు, మంజూరు కాబడిన ప్రీ-ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సభ్యులుగా ఉంటారు. ఏఏపీసీ నిధుల ద్వారా ప్రతి నెలా ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు రూ. 8,000/-, ఆయా పోస్టుకు రూ. 6,000/- చొప్పున గౌరవ వేతనాన్ని అందిస్తారు.

**అర్హతలు, వయోపరిమితి:**

ఇన్‌స్ట్రక్టర్: ఇంటర్మీడియట్ విద్యార్హతతో పాటు డీఈడీ పూర్తి చేసి ఉండాలి. ప్రాథమిక బోధనలో (ప్రీ-ప్రైమరీ) అనుభవం, అర్హత కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఉంటుంది.

**ఆయా: కనీసం 7వ తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలి.**

వయస్సు: అభ్యర్థుల వయస్సు 18 సంవత్సరాల నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి.

నివాసం: అభ్యర్థులు సదరు పాఠశాల ఉన్న గ్రామానికి చెందిన వారై ఉండాలి. స్థానిక మండలానికి చెందిన వ్యక్తిగా తహసీల్దార్ నుంచి నివాస ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుంది. స్థానికులకే మొదటి ప్రాధాన్యత ఇస్తారు.

**జతపరచాల్సిన పత్రాలు:**

విద్యార్హతల సర్టిఫికెట్లు, బోనఫైడ్, గుర్తింపు కార్డు (నివాస/వ్యక్తిగత వివరాల కోసం), కుల ధృవీకరణ పత్రం, తహసీల్దార్ జారీ చేసిన నివాస ధృవీకరణ



పత్రం, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో కూడిన దరఖాస్తులను ఆయా పాఠశాలల హెచ్ఎం కార్యాలయంలో అందజేయాలి.

**ఖాళీలు ఉన్న గ్రామాలు:**

రాజాపేట మండలంలోని సింగారం, పాముకుంట, బొందుగుల, పుట్టగూడెం, చల్లూరు, దూది వెంకటాపురం, రఘునాథపురం, బేగంపేట గ్రామాల్లోని పాఠశాలల్లో ఈ ఖాళీలు ఉన్నాయి. అర్హులైన మహిళా అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో రమేష్ కోరారు.

# టీపీయూఎస్ యాదాద్రి జిల్లా అధ్యక్షుడిగా పెండెం శ్రీనివాస్

- యాదగిరిగుట్టలో ఏకగ్రీవంగా నూతన కార్యవర్గం ఎన్నిక
- ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా
- రాష్ట్రస్థాయి ప్రతినిధుల సమావేశాలను విజయవంతం చేయాలి

**తొలివెలుగు, యాదగిరిగుట్ట:** తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం (టీపీయూఎస్) యాదాద్రి భువనగిరి జిల్లా నూతన అధ్యక్షుడిగా పెండెం శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. యాదగిరిగుట్ట పట్టణ కేంద్రంలో ఆదివారం సంఘం ప్రతినిధుల ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎన్నికల అధికారిగా విచ్చేసిన టీపీయూఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి చేరాల మురళీకృష్ణ నేతృత్వంలో ఎన్నికల ప్రక్రియను శాంతియుతంగా జరిపారు. జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్న అనంతరం, ఎన్నికల అధికారి చేతుల మీదుగా నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు అధికారిక నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా నూతన అధ్యక్షుడు పెండెం శ్రీనివాస్ మాట్లాడుతూ.. పద్మశాలి సామాజికవర్గానికి చెందిన ఉద్యోగులందరూ ఎల్లప్పుడూ ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. జిల్లా పరిధిలోని పద్మశాలి ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తన వంతు శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో టీపీయూఎస్ ఆధ్వర్యంలో సమాజానికి ఉపయోగపడేలా అనేక సామాజిక, సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 13, 14 తేదీల్లో



ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పద్మశాలి ఉద్యోగ ప్రతినిధుల 4వ మహాసభలకు జిల్లా నుంచి ఉద్యోగ సంఘాల సభ్యులు, ప్రతినిధులు భారీ సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన కోరారు.

**ఏకగ్రీవంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు:**

సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా రచ్చ గణేష్ ప్రసాద్, సహ అధ్యక్షుడిగా బడుగు పాండు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఉదారు బలరాం, మేడిశెట్టి జీవన్ కుమార్, కైరంకొండ బాలమణి బాధ్యతలు స్వీకరించారు. అలాగే సహాయ కార్యదర్శులుగా పాసికంటి పవన్ కుమార్, ఎలగందుల శ్రీకాంత్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా నుంచు వెంకటయ్య, గంజి నాగేశ్వరరావు, ప్రచార కార్యదర్శిగా బింగి చక్రపాణి ఎంపికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా మీన సురేందర్, తుమ్మ కృష్ణలను సభ్యులు ముక్తకంఠంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న పద్మశాలి ఉద్యోగులు పాల్గొన్నారు.



## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన రాజాపేట సర్పంచ్

- గ్రామ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని వినతి
- సానుకూలంగా స్పందించిన మంత్రి: సర్పంచ్ కోయ మధు

**తొలివెలుగు, రాజాపేట:** గ్రామ పంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి పనుల నిర్వహణకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతూ కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డికి ఆ గ్రామ సర్పంచ్ కోయ మధు వినతిపత్రం అందజేశారు. ఆదివారం ఆయన జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్ గౌడ్‌తో కలిసి కేంద్రమంత్రిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజాపేట గ్రామంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులను, నిధుల ఆవశ్యకతను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని, రాజాపేట గ్రామ ప్రగతికి త్వరలోనే ప్రత్యేక నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చినట్లు సర్పంచ్ కోయ మధు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ దాచేపల్లి రాజు, కుమ్మరి లక్ష్మణ్, బింగి శ్రీనివాస్, దాచేపల్లి శ్రీనివాస్, వార్డు సభ్యులు సట్టు రవీందర్, బిర్రు సురేష్, మల్యాల భరత్ తదితరులు పాల్గొన్నారు.

## తోటి మిత్రురాలికి పదో తరగతి స్నేహితుల అండ

- రోడ్డు ప్రమాదంలో భర్తను కోల్పోయిన మాధవికి ఆర్థిక సాయం
- రూ. 56,116 అందజేసిన 2009-10 బ్యాచ్ మిత్రులు
- ఆత్మకూర్(ఎం)లో మానవత్వం చాటిన వైనం



**తొలివెలుగు, ఆత్మకూర్(ఎం):** కష్టకాలంలో ఉన్న తోటి స్నేహితురాలిని ఆదుకునేందుకు పదో తరగతి మిత్రులు మానవత్వంతో ముందుకు వచ్చారు. ఆత్మకూర్(ఎం) మండలానికి చెందిన రేగు మాధవి ఇటీవల జరిగిన ఒక ఘోర రోడ్డు ప్రమాదంలో తన భర్తను కోల్పోయారు. కుటుంబ పెద్ద దిక్కును కోల్పోయి తీవ్ర ఆర్థిక, మానసిక ఇబ్బందుల్లో ఉన్న విషయాన్ని ఆమెతో పాటు చదువుకున్న స్నేహితులు గుర్తించారు. 2009-10 విద్యా సంవత్సరానికి చెందిన పదో తరగతి బ్యాచ్ మిత్రులంతా ఒక తాటిపైకి వచ్చి, తమ వంతుగా విరాళాలు సేకరించారు. ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన స్నేహితుల బృందం.. సేకరించిన రూ. 56,116/- నగదును మాధవికి ఆర్థిక సహాయంగా అందజేశారు. కష్టసమయంలో తమ కుటుంబానికి కొండంత అండగా నిలిచిన ప్రతి ఒక్క మిత్రునికి మాధవి, ఆమె కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సేవా కార్యక్రమంలో మిత్రులు మల్లం నవీన్, బత్తిని ప్రదీప్, మక్తల అనిల్, తవిటి రాజు, కొంగరి విద్యాసాగర్, సూరారం శ్రీకాంత్, జిట్ట నాగరాజు, బొడ్డు ప్రభాకర్, సుల్తాన్ సరిత, బొక్క హేమలత, రేగు మమత తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాజ్యాధికార పార్టీ మండల అధ్యక్షుడిగా బుచ్చయ్య

- ఆత్మకూరు(ఎం) మండల బాధ్యతల అప్పగింత
- నియామక పత్రాన్ని అందజేసిన రాష్ట్ర నేతలు
- పార్టీ బలోపేతానికి అంకితభావంతో కృషి చేస్తా: ఎలిమినేటి బుచ్చయ్య



**తొలివెలుగు, ఆత్మకూరు(ఎం):** తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆత్మకూరు(ఎం) మండల నూతన అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన ఎలిమినేటి బుచ్చయ్య నియమితులయ్యారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న నేతృత్వంలోని ఈ పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా ఆదివారం హైదరాబాద్‌లో నూతన కార్యవర్గ నియామకాల ప్రక్రియను చేపట్టారు. ఈ మేరకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజినీ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ సంయుక్తంగా ఎలిమినేటి బుచ్చయ్యకు అధికారిక నియామక పత్రాన్ని అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన మండల అధ్యక్షుడు ఎలిమినేటి బుచ్చయ్య మాట్లాడుతూ.. తనపై నమ్మకముంచి మండల అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు, రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నిర్దేశించిన ఆశయాలకు అనుగుణంగా, అంకితభావం, నిబద్ధతలతో పనిచేస్తానని స్పష్టం చేశారు. పార్టీ ప్రధాన అజెండా అయిన రాజ్యాధికార భావజాలాన్ని గ్రామస్థాయిలో ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తానని చెప్పారు. రాబోవు రోజుల్లో మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో కమిటీలను వేసి, సంస్థాగతంగా పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమిస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పార్టీకి చెందిన వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# యాదగిరి కొండపై భక్తుల సాగరం.. పోటెత్తిన లక్ష్మీనారసింహుడి సన్నిధి!

- వేసవి ముగింపు, సెలవు దినం కావడంతో అనూహ్యంగా పెరిగిన రద్దీ
- క్యూలైన్లలో 5 గంటల పాటు నిరీక్షణ.. కిటకిటలాడిన ఆలయ పరిసరాలు
- రుతుపవనాల వర్షాలతో చల్లబడిన వాతావరణం.. మెట్ల మార్గాన కొండపైకి భక్తులు



**తొలివెలుగు, యాదగిరిగుట్ట:** యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం ఆదివారం భక్తులతో పోటెత్తింది. వేసవి సెలవులు ముగుస్తుండటం, త్వరలోనే పాఠశాలలు పునఃప్రారంభం కానుండటంతో పాటు ఆదివారం సెలవు దినం కావడంతో కొండపైకి భక్తులు అనూహ్య సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే ఆలయ పరిసరాలన్నీ భక్తుల కోలాహలంతో కిటకిటలాడాయి. ఆదివారం ఒక్కరోజే సుమారు 45 వేల మంది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నట్లు దేవస్థానం అధికారులు వెల్లడించారు. భక్తుల రద్దీ కారణంగా ధర్మదర్శనానికి సుమారు 5 గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు.

**కిటకిటలాడిన క్షేత్ర పరిసరాలు:**

కొండపైన గల గర్భాలయం, సాధారణ, ప్రత్యేక దర్శనాల క్యూలైన్లు, ప్రసాద విక్రయశాలలు భక్తులతో నిండిపోయాయి. కొండ కింద గల లక్ష్మీ పుష్కరిణి (విష్ణు పుష్కరిణి), కల్యాణకట్ట, సత్యనారాయణ వ్రత మండపం, అన్నదాన సత్రం తదితర ప్రాంతాలన్నీ జనసందోహంగా మారాయి. భక్తులు ఉదయాన్నే పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి, తలనీలాలు సమర్పించి స్వామివారి దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్నారు. నైరుతి రుతుపవనాల ప్రభావంతో కురిసిన వర్షాల వల్ల వాతావరణం చల్లబడటంతో, అత్యధిక శాతం మంది భక్తులు కాలినడకన మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకున్నారు.

**చిన్నారులు, వృద్ధులకు ప్రత్యేక వాహనాలు:**

కొండపైకి చేరుకున్న భక్తుల సౌకర్యార్థం దేవస్థానం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, వికలాంగుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కొండపై ఉచిత బ్యాటరీ వాహనాలను అందుబాటులో ఉంచారు. కొండపైన గల బస్టాండ్ వద్ద నుంచి స్వామివారి తూర్పు రాజగోపురం వరకు




భక్తులను ఈ బ్యాటరీ వాహనాల ద్వారా సురక్షితంగా చేరవేశారు. ప్రసాద కౌంటర్ల వద్ద రద్దీకి అనుగుణంగా అదనపు సిబ్బందిని నియమించి భక్తులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నట్లు ఆలయ అధికారులు వివరించారు.



# దివ్యాంగ చిన్నారుల జీవితాల్లో 'భవిత' వెలుగులు





- రాజాపేట కేంద్రంలో సఫలీకృతమవుతున్న ప్రభుత్వ ఆశయం
- కలిసివచ్చిన బడిబాట.. ప్రత్యేక పిల్లలకు పునరావాసం
- ఇంటికే వచ్చి చదువు చెప్పే హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్
- సద్వినియోగం చేసుకోవాలంటున్న ఎంఈఓ చందా రమేష్

**తొలివెలుగు, రాజాపేట:** శారీరక, మానసిక లోపాలతో బాధపడుతూ నలుగురిలోకి రాలేక ఇళ్లకే పరిమితమైన దివ్యాంగ చిన్నారుల జీవితాల్లో సమగ్ర శిక్ష విభాగం ఆధ్వర్యంలో నడుస్తున్న 'భవిత' కేంద్రాలు సరికొత్త వెలుగులు నింపుతున్నాయి. జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో ఇలాంటి పిల్లలను గుర్తించి కేంద్రాల్లో చేర్పిస్తున్నారు. కేవలం చదువు మాత్రమే కాకుండా, వీరు సమాజంలో తమ కాళ్లపై తాము నిలబడేలా కనీస జీవన నైపుణ్యాలైన స్నానం చేయడం, బట్టలు వేసుకోవడం, తినడం వంటి వాటిలో ప్రత్యేక శిక్షణ ఇస్తూ పునరావాస కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నారు. రాజాపేట మండల కేంద్రంలోని భవిత సెంటర్ మండల విద్యాధికారి చందా రమేష్ పర్యవేక్షణలో అద్భుతంగా నడుస్తోంది. తీవ్రమైన వైకల్యంతో కేంద్రానికి రాలేని పిల్లల కోసం ఐ.ఈ.ఆర్.పి లు వారంలో ఒకరోజు (శనివారం) నేరుగా వారి ఇళ్లకే వెళ్లి విద్యాబుద్ధులు నేర్పే 'హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్' విధానాన్ని అమలు చేస్తున్నారు. ఇక్కడ పిల్లలకు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం కోసం ప్రతి వారం నిపుణులైన ఫిజియోథెరపిస్టులతో ఉచితంగా థెరపీలు చేయిస్తున్నారు. రాజాపేట సెంటర్‌లో ఫిజియోథెరపిస్ట్ మచ్చ స్రవంతి అందిస్తున్న సేవలు పిల్లల్లో ఎంతో మార్పు తీసుకువస్తున్నాయి. వేసవి సెలవుల్లోనూ ఈ సేవలు నిరంతరాయంగా సాగాయి.

**ఉపకరణాలు - ప్రభుత్వ ఆర్థిక సాయం:**

కేంద్రంలో నమోదైన పిల్లలకు ప్రభుత్వం రవాణా భత్యం కింద నెలకు రూ. 500, తోడుగా వచ్చే సంరక్షకునికి ఎస్కార్ట్ అలవెన్స్ కింద రూ. 550, బాలికల ప్రోత్సాహానికి గర్ల్స్ స్టైఫండ్ రూ. 200 చొప్పున అందిస్తోంది. దృష్టిలోపం ఉన్న వారికి రీడర్ అలవెన్స్, ఉన్నత తరగతుల విద్యార్థులకు ప్రత్యేక స్కాలర్‌షిప్‌లు ఇస్తున్నారు. అలింకో సంస్థ సహకారంతో ఏటా విద్యార్థులకు ఉచితంగా వీల్ చైర్లు, ట్రై సైకిళ్లు, వినికిడి యంత్రాలు అందిస్తున్నట్లు ఐఈఆర్‌టీ సంధ్యారాణి పేర్కొన్నారు. మెడికల్ క్యాంపుల ద్వారా శస్త్రచికిత్సలు అవసరమైన పిల్లలను గుర్తించి ఆరోగ్యశ్రీ, సర్వశిక్షా నిధులతో ఉచితంగా ఆపరేషన్లు కూడా చేయిస్తారు. గ్రామాలలోని తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం సదరం సర్టిఫికేట్, ఆధార్ కార్డులతో భవిత కేంద్రంలో పేర్లు నమోదు చేయించుకోవాలని ఎంఈఓ సూచించారు.

## ఉప సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నరేష్

- రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవ ఎన్నిక
- హక్కుల సాధన, గ్రామాభివృద్ధే లక్ష్యం: మజ్జిగ నరేష్

**తొలివెలుగు, ఆత్మకూర్(ఎం):** ఆత్మకూరు(ఎం) ఉప సర్పంచ్ మజ్జిగ నరేష్‌కు రాష్ట్రస్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉప సర్పంచ్‌గా గెలుపొందిన ఆయన చొరవను గుర్తించిన ఉప సర్పంచ్‌ల ఫోరం.. తమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నరేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకుంది. రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. ఈ సందర్భంగా మజ్జిగ నరేష్ భావోద్వేగంతో మాట్లాడుతూ.. తన ఎన్నికకు సహకరించి, తన నాయకత్వంపై విశ్వాసం ఉంచిన ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల కార్తీక్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కటకం స్వప్న, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మామిడి కవిత శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు దుస్స కుమార్ సహా రాష్ట్ర కమిటీ సభ్యులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. క్షేత్రస్థాయిలో ఉప సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న నిధులు, విధుల సమస్యలపై రాష్ట్రస్థాయిలో గళం విప్పుతానని భరోసా ఇచ్చారు. ఉప సర్పంచ్‌ల ఆత్మగౌరవాన్ని కాపాడుతూనే, గ్రామాల్లో ప్రగతి పరుగులు పెట్టించేందుకు తన వంతు శాయశక్తులా కృషి చేస్తానని నరేష్ స్పష్టం చేశారు.



## తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

- ముక్తాపూర్‌లో ప్రమాదం.. మోకు జారడంతో కిందపడ్డ దుబ్బాక యాదయ్య
- పక్కటెముకలు విరిగి అంతర్గత రక్తస్రావం.. హైదరాబాద్‌కు తరలింపు
- ఆదుకోవాలని కుటుంబ సభ్యుల ఆవేదన



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** తాటిచెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు కింద పడి ఓ గీత కార్మికుడు తీవ్రంగా గాయపడిన ఘటన పోచంపల్లి పురపాలక పరిధిలోని ముక్తాపూర్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ముక్తాపూర్ గ్రామానికి చెందిన దుబ్బాక యాదయ్య కాలం గడుస్తున్నా గీత కార్మిక వృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే ఆదివారం ఉదయం కూడా కల్లు గీసేందుకు గ్రామ శివారులోని తాటిచెట్టు ఎక్కాడు. అయితే, చెట్టుపై కల్లు గీస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు మోకు జారిపోవడంతో యాదయ్య ఒక్కసారిగా పైనుంచి కిందపడిపోయాడు. గమనించిన తోటి కార్మికులు, స్థానికులు తక్షణమే స్పందించి ఆయనను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు యాదయ్య పక్కటెముకలు విరిగిపోయాయని, శరీర అంతర్గత భాగాల్లో తీవ్రంగా రక్తస్రావం జరుగుతోందని తేల్చారు. అత్యవసరంగా శస్త్రచికిత్స చేయాల్సి ఉంటుందని వైద్యులు స్పష్టం చేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన యాదయ్యకు లక్షలాది రూపాయల వైద్య ఖర్చులు భారంగా మారడంతో ఆయన భార్య, పిల్లలు కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రభుత్వం స్పందించి యాదయ్య కుటుంబానికి తగిన ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని గీత కార్మిక సంఘాల నాయకులు, స్థానికులు కోరుతున్నారు.



# దోతిగూడెంలో మల్లన్న కల్యాణ వైభోగం!

- వైభవంగా భ్రమరాంబిక సమేత మల్లన్న కల్యాణ మహోత్సవం
- పట్టువస్త్రాలు సమర్పించి కల్యాణ తంతు నిర్వహించిన ఆలయ చైర్మన్ సుధాకర్ రెడ్డి దంపతులు
- వివిధ పార్టీల ప్రముఖుల ప్రత్యేక పూజలు.. అశేషంగా తరలివచ్చిన భక్తులు



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** మండల పరిధిలోని దోతిగూడెం గ్రామంలో వెలిసిన శ్రీశ్రీశ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారి కల్యాణ మహోత్సవం ఆదివారం కన్నులపండువగా జరిగింది. వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆలయంలో ఒగ్గు పూజారులు సాంప్రదాయబద్ధంగా స్వామివారి ప్రత్యేక మల్లన్న పటాన్ని ఆవిష్కరించి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం ఉత్సవమూర్తులను సుందరంగా పట్టు వస్త్రాలు, విశేష ఆభరణాలతో అలంకరించి కల్యాణ వేదికపైకి తీసుకొచ్చారు. వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణ తంతును వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ పగిళ్ల సుధాకర్ రెడ్డి దంపతులు ఈ కల్యాణ క్రతువులో పాల్గొని పట్టువస్త్రాలు సమర్పించి ముత్యాల తలంబ్రాలు పోశారు. ఈ మహోత్సవానికి వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేశం, మాజీ జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సతీమణి పైళ్ల వనిత శేఖర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ యట జంగయ్య, మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్ రెడ్డి, కడ్తాల్ సీఐ సైదిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కందడి భూపాల్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ పాక వెంకటేష్ యాదవ్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు పాక మల్లేష్ యాదవ్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పాటి సుధాకర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముత్యాల మహిపాల్ రెడ్డిలు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులందరికీ భారీగా మహా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

**భక్తిశ్రద్ధలతో వీరబోనాలు, అగ్నిగుండాలు:**

మధ్యాహ్నం అనంతరం భక్తులు వీరబోనం, అగ్నిగుండాల కార్యక్రమంలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం మహిళా భక్తులందరూ సాంప్రదాయ దుస్తులు ధరించి ఊరేగింపుగా బోనాలను తలపై ఎత్తుకుని వచ్చి స్వామివారికి సమర్పించారు. ఉత్సవాల్లో భాగంగా ఒగ్గు కళాకారులు ప్రదర్శించిన 'మల్లన్న యక్షగానం' భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు పగిళ్ల రామిరెడ్డి, బాల మల్లేష్ యాదవ్, బత్తుల శ్రీశైలం గౌడ్, ఆలయ ఉపాధ్యక్షులు బాల మల్లేష్ యాదవ్, లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం శాశ్వత ధర్మకర్త దేవరపల్లి బుచ్చిరెడ్డి, ఆలయ ప్రధాన కార్యదర్శి ప్రసాదం విష్ణు, కోశాధికారి ముద్దం సత్యం యాదవ్, ఉపసర్పంచ్ బద్దం వెంకటరెడ్డి, వార్డ్ మెంబర్ ముద్ద హరీష్ యాదవ్, తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.



# వెల్వర్తి మత్స్య సహకార సంఘం పాలకవర్గం ప్రమాణ స్వీకారం

- ఏడేళ్ల తర్వాత ప్రశాంతంగా ముగిసిన ఎన్నికల పర్వం
- అధ్యక్షుడిగా బత్తెపు శేఖర్, ఉపాధ్యక్షుడిగా మారబోయిన పరశురాం బాధ్యతల స్వీకరణ
- సంఘం బలోపేతానికి శాయశక్తులా కృషి చేస్తాం

**తొలివెలుగు, వలిగొండ:** మండలం వెల్వర్తి గ్రామంలో సుదీర్ఘ విరామం తర్వాత నిర్వహించిన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. గత ఏడు సంవత్సరాలుగా వాయిదా పడుతూ వస్తున్న ఈ ఎన్నికలను అధికారులు పకడ్బందీగా నిర్వహించారు. ఈ ఎన్నికల్లో విజయం సాధించిన నూతన పాలకవర్గానికి ఆదివారం గ్రామ కేంద్రంలో ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని వైభవంగా జరిపారు. ఎన్నికల అధికారి కుర్ర సురేష్ సమక్షంలో నూతన సమితి సభ్యులచే శాస్త్రోక్తంగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ క్రతువులో సంఘం నూతన అధ్యక్షుడిగా బత్తెపు శేఖర్, ఉపాధ్యక్షుడిగా మారబోయిన పరుశురాం, కార్యదర్శిగా సురబోయిన దయాకర్ లు ప్రమాణ స్వీకారం చేసి అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. వీరితో పాటు డైరెక్టర్లుగా ఎన్నికైన నిమ్మల శేఖర్, దుడ్డు ఆంజనేయులు, బోల్లెబోయిన శేఖర్, మారబోయిన అంజయ్య, దుడ్డు అండాలు, చెవ్వ ఎల్లమ్మలు కూడా పదవీ ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు నూతన కమిటీని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

**హక్కుల పరిరక్షణే ధ్యేయం:**

అనంతరం నూతన అధ్యక్షుడు బత్తెపు శేఖర్ మాట్లాడుతూ.. తమపై నమ్మకం ఉంచి ఓటు వేసి గెలిపించిన ప్రతి ఒక్క సభ్యునికి కృతజ్ఞతలు తెలిపారు. మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, సంఘాన్ని అభివృద్ధి పథంలో ముందు వరుసలో నిలుపుతామని హామీ ఇచ్చారు. ముదిరాజ్ సామాజికవర్గ సంక్షేమం, ఐక్యత, సభ్యుల హక్కుల పరిరక్షణ కోసం నూతన నాయకత్వం నిరంతరం శ్రమిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ గ్రామ శాఖ అధ్యక్షుడు గుర్రాల రాములు, ప్రముఖులు చెవ్వ కృష్ణ, చెవ్వ బిక్షపతి, మారబోయిన బిక్షపతి, సారగండ్ల రాజు, దుడ్డు రమేష్, కాల్వల లింగస్వామి, చెవ్వ మధు, దాసబోయిన వెంకటేశం, దుడ్డు నవీన్, బొల్లబోయిన మధు, నిమ్మల సురేష్, నిమ్మల నవీన్, దుడ్డు గణేష్, బొల్లబోయిన వంశీ, మారబోయిన అనిల్, సారగండ్ల ఉదయ్, మత్స్య పారిశ్రామిక సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా 'చైతన్య పీపుల్ ట్రస్ట్' ప్రారంభం

- ఆలయ పునర్నిర్మాణానికి రూ. 5 లక్షల విరాళం
- గ్రామ రక్షణకు 7 సీసీ కెమెరాల అందజేత
- యువత సమాజ సేవకు ముందుకు రావడం అభినందనీయం: ఎస్ఐ జగన్

**తొలివెలుగు, సంస్థాన్ నారాయణపురం:** గ్రామ అభివృద్ధి, విద్య, ఆరోగ్యం, సామాజిక సేవలే లక్ష్యంగా సంస్థాన్ నారాయణపురం మండల పరిధిలోని లింగవారిగూడెంలో ఏర్పాటు చేసిన 'చైతన్య పీపుల్ ట్రస్ట్' ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సేవాలయాన్ని నారాయణపురం ఎస్ఐ జగన్ అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్న వయసులోనే స్వగ్రామంపై బాధ్యతతో సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఇలాంటి సేవా సంస్థలకు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని చెప్పారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు కత్తుల చైతన్య మాట్లాడుతూ.. తన సంపాదనలో కొంత భాగాన్ని ట్రస్ట్ ద్వారా సామాజిక సంక్షేమానికి వెచ్చిస్తానని, లింగవారిగూడెంను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ప్రకటించారు. ఇందులో భాగంగా గ్రామంలోని శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయ పునర్నిర్మాణానికి రూ. 5,00,000/- విరాళం చెక్కును అందజేశారు. అలాగే గ్రామ భద్రత కోసం 7 సీసీ కెమెరాలను ఉచితంగా సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కత్తుల జ్యోతి వాసు, డీసీసీ ఎగ్జిక్యూటివ్ సభ్యులు కత్తుల లక్ష్మయ్య, ఉపసర్పంచ్ లింగారెడ్డి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.




# జూలూరు కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఒంటెద్దు వెంకటేష్

- సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక
- సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తా: వెంకటేష్



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** మండల పరిధిలోని జూలూరు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ సర్వసభ్య సమావేశం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా స్థానిక సర్పంచ్ కాసుల అంజయ్య, ఉప సర్పంచ్ దాసరి నరసింహ హాజరై, పార్టీ బలోపేతంపై దిశానిర్దేశం చేశారు. అనంతరం నూతన గ్రామ శాఖ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాంగ్రెస్ గ్రామ శాఖ నూతన అధ్యక్షుడిగా ఒంటెద్దు వెంకటేష్ ఎన్నికయ్యారు. కమిటీలోని ఇతర బాధ్యుల వివరాలు.. ఉపాధ్యక్షుడిగా సిర్పంగి గంగయ్య, ప్రధాన కార్యదర్శిగా సందిని బాలకృష్ణ, కోశాధికారిగా గంగాపురం శివ, మైనార్టీ కార్యదర్శిగా ఎండీ చాంద్ పాషాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా దత్తాయిగూడెం శ్రీధర్, కమిటీ శరత్, కేతం నాగరాజు, మూటపురం ప్రభాకర్, చిలువేరు ఐలయ్య, సందిని అఖిల్, కొత్తపల్లి శ్రీనివాస్, గవ్వల నాగరాజులు నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఒంటెద్దు వెంకటేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామ ప్రజలందరికీ చేరేలా కృషి చేస్తానన్నారు. కార్యకర్తలందరినీ ఏకతాటిపైకి తెచ్చి పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమిస్తానని పేర్కొన్నారు.

# ఇంద్రియాలలో ఘనంగా 'బడిబాట'

- ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య: సర్పంచ్ ధరావత్ వెంకటేష్
- ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించిన ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, జాయినింగ్



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** మండల పరిధిలోని ఇంద్రియాల గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ధరావత్ వెంకటేష్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై, బడిబాట ర్యాలీని ప్రారంభించారు. అనంతరం గ్రామ వీధుల్లో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలంటూ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటేష్ నాయక్ మాట్లాడుతూ.. ఉన్నత విద్యా అర్హతలు కలిగి, ప్రభుత్వం ద్వారా కఠినమైన శిక్షణ పొందిన ఉత్తమ ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉన్నారని గుర్తుచేశారు. సర్కారు బడుల్లో చదివే పిల్లలకు ఉచిత పాఠ్యపుస్తకాలు, రెండు జతల దుస్తులతో పాటు మధ్యాహ్న భోజన పథకం ద్వారా ప్రతిరోజూ రుచికరమైన, పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు వివరించారు. ప్రైవేట్ పాఠశాలల వైపు వెళ్లకుండా, ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బండ కృష్ణ, ప్రధానోపాధ్యాయులు గురునాథం, నాయకులు రాజనారాయణ, వార్డు సభ్యులు ఎర్ర విక్రమ్, బుచ్చిబాబు, మొగిలిపాక అనిత సుధాకర్, ఉపాధ్యాయులు వందన, రవి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.ద

# ఆకాష్ మెటల్ ఇండస్ట్రీలో రూ.50 లక్షల సీసం దిమ్మల చోరీ!

- అత్యాశతో దొంగతనానికి పాల్పడిన ఇద్దరు సూపర్‌వైజర్లు
- మూడు నెలలుగా గోడ అవతలికి ముడిసరుకు విసిరేసి తరలింపు
- సీసీ కెమెరాల ఆధారంగా గుట్టురట్టు.. ఎస్సై భాస్కర్ రెడ్డి వెల్లడి


**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** తాము పనిచేస్తున్న కంపెనీలోనే ఇద్దరు సూపర్‌వైజర్లు వక్రబుద్ధితో తోటి కార్మికులను లొంగదీసుకుని భారీ చోరీకి పాల్పడ్డారు. బ్యాటరీల తయారీకి ఉపయోగించే సుమారు రూ.50 లక్షల విలువైన 25 మెట్రిక్ టన్నుల సీసం (లెడ్) ముడిసరుకును అపహరించిన ఘటన పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని నారాయణగిరిలో గల 'ఆకాష్ మెటల్ ఇండస్ట్రీ' కంపెనీలో వెలుగుచూసింది. పోచంపల్లి ఎస్సై భాస్కర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..

**కంచె చేను మేసిన చందంగా..**

నారాయణగిరిలోని ఆకాష్ మెటల్ కంపెనీలో నల్లగట్ల శశి కుమార్, రాపోలు భాస్కర్ అనే ఇద్దరు వ్యక్తులు సూపర్‌వైజర్లుగా పనిచేస్తున్నారు. వీరు త్వరగా డబ్బు సంపాదించాలనే అత్యాశతో తాము పనిచేస్తున్న కంపెనీలోనే దొంగతనానికి వ్యూహం రచించారు. ఇందులో భాగంగా కంపెనీలో పనిచేసే మరికొందరు కార్మికులను తమతో కలుపుకున్నారు. గత మూడు నెలలుగా ప్రణాళికాబద్ధంగా రాత్రి సమయాల్లో బ్యాటరీల ముడి పదార్థమైన సీసం దిమ్మలను కొద్దికొద్దిగా కంపెనీ కాంపౌండ్ గోడ అవతలికి విసిరేసేవారు. అనంతరం బయట సిద్ధంగా ఉంచిన ఆటోల్లోకి ఆ సరుకును ఎక్కించి, రహస్య ప్రాంతాలకు తరలించి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇటీవల కంపెనీ యాజమాన్యం వార్షిక స్టాక్ తనిఖీ చేయగా.. నిల్వల్లో భారీగా తేడా వచ్చింది. సుమారు 25 మెట్రిక్ టన్నుల ముడిసరుకు తక్కువగా ఉన్నట్లు గుర్తించిన యాజమాన్యం నిర్ఘాంతపోయింది. దీనిపై అనుమానం వచ్చి కంపెనీ ఆవరణలోని సీసీటీవీ కెమెరాల రికార్డింగులను క్షుణ్ణంగా పరిశీలించగా.. నమ్మకంగా ఉండాల్సిన సూపర్‌వైజర్లే దొంగతనానికి పాల్పడుతున్న దృశ్యాలు చూసి షాక్‌కు గురయ్యారు. దీంతో కంపెనీ నిర్వాహకులు తక్షణమే పోచంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై భాస్కర్ రెడ్డి తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా, వారు తాము చేసిన నేరాన్ని అంగీకరించారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

# పదవి ఆమెది.. పెత్తనం ఆయనది!

- పొనకల్ గ్రామ పంచాయతీలో ప్రోటోకాల్‌కు తిలోదకాలు
- అధికారిక కార్యక్రమాల్లో దర్జాగా సర్పంచ్ భర్త ఆసీనం
- అధికారులను దబాయించడంపై సర్వత్రా విస్మయం
- రబ్బరు స్టాంపులుగా మారుతున్న మహిళా ప్రజాప్రతినిధులు





**తొలివెలుగు, జన్నారం:** స్థానిక సంస్థల్లో మహిళలకు ప్రాతినిధ్యం కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కేటాయించిన రిజర్వేషన్ల ఆశయం క్షేత్రస్థాయిలో నీరుగారుతోంది. ఓటేసి గెలిపించింది మహిళా ప్రజాప్రతినిధిని అయితే.. తెరవెనుక ఉండి చక్రం తిప్పుతోంది మాత్రం ఆమె భర్తే కావడం గమనార్హం. జన్నారం మండలంలోని పొనకల్ గ్రామ పంచాయతీలో సర్పంచ్ భర్త చలాయిస్తున్న లౌకిక అధికారం ఇప్పుడు మండల వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రోటోకాల్ నిబంధనల ప్రకారం సర్పంచ్ హాజరుకావాల్సిన ప్రతి అధికారిక కార్యక్రమం, సభల్లో ఆమె భర్త ముందుండటం, అధికారుల పక్కన దర్జాగా కుర్చీ వేసుకుని కూర్చోవడం ఇక్కడి ధోరణికి అద్దం పడుతోంది.

**అధికారులపైనే దబాయింపులు:**

పాలకవర్గం బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచే ఇక్కడ 'సర్పంచ్ పతి' సంస్కృతికి తెరలేచింది. ప్రమాణ స్వీకార వేళ మహిళా సర్పంచ్ పక్కనే ఆమె భర్తకు కూడా కుర్చీ వేసి సన్మానించడం అప్పట్లోనే విమర్శలకు తావిచ్చింది. తాజాగా, గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పరిశీలనకు మహిళా సర్పంచ్‌కు బదులుగా ఆమె భర్త వెళ్లడం, అక్కడకు వచ్చిన ఉన్నతాధికారులను సైతం ఆయన దబాయించడం స్థానికులను నివ్వెరబోయేలా చేసింది. చట్టప్రకారం ఎలాంటి అధికారిక హోదా లేని వ్యక్తి.. ఏ అధికారం చూసుకుని అధికారులను నిలదీస్తున్నారనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.

**సామాజిక మాధ్యమాల్లో వ్యంగ్యాస్త్రాలు:**

అటు కుటుంబీకులు, ఇటు అధికారులు సైతం 'అతడిదే పెత్తనం' అని అంగీకరించినట్లుగా వ్యవహరించడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. అధికారిక సభల్లోనూ సర్పంచ్ పేరు పక్కన భర్త పేరును జోడించి ప్రస్తావిస్తుండటంతో, "అర్ధనారీశ్వరుడు అంటే ఇదేనేమో" అంటూ సామాజిక మాధ్యమాల్లో నెటిజన్లు వ్యంగ్యంగా పోస్టులు పెడుతున్నారు. మహిళా సాధికారతకు ఇలాంటి చర్యలు గొడ్డలిపెట్టు లాంటివని, ఉన్నతాధికారులు స్పందించి ప్రోటోకాల్ ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవాలని మేధావులు కోరుతున్నారు.




# భవన నిర్మాణ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



- చౌటుప్పల్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం నిరవధిక సమ్మె
- రూ. 5 వేల పెన్షన్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలి
- సిపిఎం మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్ డిమాండ్

**తొలివెలుగు, చౌటుప్పల్:** రాష్ట్రంలో భవన నిర్మాణ రంగంపై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది మంది కార్మికులు తీవ్ర సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సిపిఎం మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్ డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చౌటుప్పల్–కొండూరు రోడ్డు చౌరస్తా వద్ద చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం కూడా కొనసాగింది. ఈ నిరసన కార్యక్రమానికి కరుణాకర్ హాజరై కార్మికులకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో నమోదైన కార్మికులకు అందాల్సిన సంక్షేమ పథకాలను ప్రభుత్వం సక్రమంగా అమలు చేయడం లేదని విమర్శించారు. ప్రమాద బీమా, విద్యా సహాయం, ప్రసూతి ప్రయోజనాలు, వివాహ కానుకలు వంటి సంక్షేమ నిధులను ఆలస్యం చేయకుండా లబ్ధిదారులకు తక్షణమే అందజేయాలని కోరారు. 55 సంవత్సరాలు నిండిన ప్రతి భవన నిర్మాణ కార్మికుడికి నెలకు రూ. 5,000 చొప్పున పెన్షన్ ఇవ్వాలని, అలాగే ప్రతి కార్మికుడి కుటుంబానికి ఉచిత వైద్య సదుపాయం కోసం ఈఎస్ఐ కార్డు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

**నిర్మాణ సామాగ్రి ధరల పెంపుతో ఉపాధి కరవు:**

మార్కెట్లో సిమెంట్, ఇసుక, ఐరన్ వంటి నిర్మాణ సామాగ్రి ధరలు విపరీతంగా పెరగడం వల్ల నిర్మాణ రంగం కుంటుపడిందని, దీంతో కార్మికులకు ఉపాధి కరవై జీవనం మరింత భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కార్మికులకు ఉపాధి భద్రత కల్పించడంతో పాటు కనీస వేతనాలను పెంచి అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి ఎండి పాషా, గుణముని రాములు, కలకుంట్ల శివ, నెల్లికంటి నరసింహ, సీమకండ్ల శ్రీరాములు, మాండారి మార్క్, జాజుల బిక్షపతి, గజ్జల రాజు, ఉబ్బు యాదయ్య, సుక్క యాదయ్య, సువర్ణ, దుర్గం గాలయ్య, ఉదరి రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ దుకాణాల ద్వారా 14 రకాల వస్తువులు పంపిణీ చేయాలి

- ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలి
- వలిగొండలో 'ఐద్వా' ఆధ్వర్యంలో విస్తృత సర్వే
- ఇచ్చిన హామీలను ప్రభుత్వం నిలబెట్టుకోవాలి: బట్టుపల్లి అనురాధ



**తొలివెలుగు, వలిగొండ:** ఎద, మధ్యతరగతి ప్రజల ప్రయోజనాల దృష్ట్యా రేషన్ షాపుల ద్వారా కేవలం బియ్యం మాత్రమే కాకుండా 14 రకాల నిత్యవసర వస్తువులను పంపిణీ చేయాలని ఐద్వా (అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం) జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టుపల్లి అనురాధ డిమాండ్ చేశారు. ఆదివారం వలిగొండ మండల కేంద్రంలోని పాత ఎమ్మార్వో కార్యాలయ పరిసర ప్రాంతాల్లో ఐద్వా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై విస్తృత సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అనురాధ స్థానిక మహిళలతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకున్నారు.దఅనంతరం ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ తప్పుడు ఆర్థిక విధానాల వల్ల నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరల పెంపుతో పాటు మార్కెట్లో కూరగాయలు, పప్పుధాన్యాలు, వంటనూనెల ధరలు విపరీతంగా పెరగడం వల్ల సామాన్యులు, ముఖ్యంగా మహిళలు సంసారాన్ని ఈదలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇలాంటి తరుణంలో ప్రభుత్వం కేవలం బియ్యం ఇచ్చి చేతులు దులుపుకోకుండా, గతంలో లాగే పప్పు, ఉప్పు, నూనెతో సహా 14 రకాల వస్తువులను ఉచితంగా లేదా రాయితీ ధరలపై అందించి పేదలపై ఆర్థిక భారాన్ని తగ్గించాలని కోరారు. అర్హులైన పేదలందరికీ తక్షణమే కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని, రేషన్ దుకాణాల్లో నాణ్యమైన సరుకులను సరైన కొలతలతో ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**ఉచిత హామీలను నెరవేర్చాలి:**

ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు కావస్తున్నా, ఎన్నికల సమయంలో మహిళలకు ఇస్తామన్న రూ. 2,500 జీవనభృతి హామీని ఇప్పటివరకు విస్మరించడం సరికాదన్నారు. అలాగే వ్యవసాయ కూలీలకు ఏటా ఇస్తామన్న రూ. 12,000 సాయాన్ని ఎప్పుడు అమలు చేస్తారని ఆమె ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మహిళలకు, కూలీలకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సర్వే కార్యక్రమంలో ఐద్వా పట్టణ కార్యదర్శి శీలం ఇందిర, సహాయ కార్యదర్శి కూర మంగమ్మ, పట్టణ నాయకులు వేముల లలిత, సిర్పంగి స్వప్న, శోభ, పద్మ, బేబీ, స్వప్న, పద్మ, నాగరాణి పాల్గొన్నారు.

## జిల్లా ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షుడిగా కుంభం ఇంద్రసేనారెడ్డి

- నియామక ఉత్తర్వులు జారీ చేసిన టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్షుడు
- జర్నలిస్టుల హక్కుల పరిరక్షణే ధ్యేయం: ఇంద్రసేనారెడ్డి



**తొలివెలుగు, నల్లగొండ:** టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా కమిటీ అనుబంధ సంస్థ అయిన నల్లగొండ జిల్లా ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడిగా కుంభం ఇంద్రసేనారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు టీయూడబ్ల్యూజే (ఐజేయు) నల్లగొండ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో నియామక ఉత్తర్వులను జారీ చేశారు. ఇటీవల నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన జిల్లా మహాసభల్లో జిల్లా కమిటీతో పాటు జిల్లా ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని కూడా ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు కృష్ణారెడ్డి తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణే లక్ష్యంగా ఈ నూతన కార్యవర్గాన్ని పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా నూతన ఉపాధ్యక్షుడు కుంభం ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకముంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు వీరహత్ హాలీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణ, జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పులిమామిడి మహేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు మాదరి యాదగిరి, ఏరెడ్ల చంద్రశేఖర్ రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి, సంఘం బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తానని స్పష్టం చేశారు. ఇంద్రసేనారెడ్డి నియామకం పట్ల జిల్లా వ్యాప్తంగా పలువురు జర్నలిస్టులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# స్టాక్ ట్రేడింగ్ మోసాల్లో విద్యావంతులే బాధితులు

**ఆశకు పోయి రూ.లక్షల్లో నష్టపోతున్న వైనం**

స్టాక్ ట్రేడింగ్‌లో భారీ లాభాలిప్పిస్తామని నమ్మిస్తూ సైబర్‌నేరగాళ్లు విద్యావంతులపై వల వేస్తున్నారు. ఇందులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు సైతం చిక్కి భారీగా మోసాలకు గురవుతున్నారు. ట్రేడింగ్ మోసాల్లో అత్యాశకు పోయి మోసపోతున్న వారే ఉండడం ఆందోళన కలిగిస్తోంది. సోషల్‌మీడియా ఫ్లాట్‌ఫామ్‌ను అడ్డాగా చేసుకొని సైబర్‌నేరగాళ్లు బాధితులను ఆకర్షిస్తున్నారు. సోషల్‌మీడియాలో వచ్చే ఈ స్టాక్ ట్రేడింగ్ ప్రకటనలను చూసి, లింక్‌లు క్లిక్ చేస్తూ నేరగాళ్లు వేసే వలకు చిక్కుతున్నారు. ఆ తరువాత కొంత మొత్తం పెట్టి అదృష్టాన్ని పరిశీలించుకుందామని వెళ్లేవారు కొందరైతే.. సైబర్‌నేరగాళ్లు చెప్పేది నిజమని గుడ్డిగా నమ్మి పెట్టుబడి పెట్టేవాళ్లు కొందరు ఉంటున్నారు. సైబర్‌నేరగాళ్లు స్టాక్ ట్రేడింగ్ మోసాలు చేసేందుకు రోజురోజుకు కొత్తకొత్త ఎత్తులతో సోషల్‌మీడియాలో ప్రకటనలు గుప్పిస్తున్నారు. ఈ ప్రకటనలలో ఏఐ ఆధారిత వీడియోలను సైతం తయారు చేస్తూ, ప్రముఖుల వీడియోలు తయారు చేస్తున్నారు. ఇందులో కేంద్ర ఆర్థిక మంత్రి వీడియోలు, ప్రతిపక్ష నాయకుల వీడియోలు, ప్రముఖ సంస్థల ప్రతినిధుల వీడియోలను తయారు చేసి అమాయకులను మోసం చేస్తున్నారు. ఇలాంటి వాటితో ఎక్కువగా రిటైర్డు ఉద్యోగులు మోసపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. ట్రై పోలీస్ కమిషనరేట్లలోని సైబర్ ఠాణాలకు వచ్చే ఫిర్యాదులలో 70 శాతం ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్ ఉంటుంది. డిజిటల్‌పై పట్టున్న వారు సైతం ఈజీగా సైబర్‌నేరగాళ్ల చేతికి చిక్కి మోసపోతున్నారు.

**స్టాక్స్‌లో లాభాల కోసం..**

ఈజీ మనీతోపాటు వేగంగా లక్షల్లో సంపాదించవచ్చనే అత్యాశ బాధితుల కొంప ముంచుతున్నది. సైబర్‌నేరగాళ్లు దీనిని ఆసరాగా చేసుకుంటూ స్టాక్ ట్రేడింగ్‌లో లాభాలు సంపాదించే మెలుకువల పేరుతో బాధితులను బుట్టలో పడేస్తున్నారు. స్టాక్ ట్రేడింగ్‌లో జరుగుతున్న మోసాలపై పోలీసులు కూడా ఎక్కువగా అవగాహన కల్పించకపోవడం, బాధితులంతా సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్‌పైనే ఎక్కువగా ఆధారపడుతుండడంతో ఈజీగా మోసానికి గురవుతున్నారు. ఇంటర్‌నెట్ ఎవరికి వారు స్టాక్ ట్రేడింగ్‌లో తాము నిపుణులమంటూ చెప్పుకునే మాటలకు విద్యావంతులు ఈజీగా బోల్తా పడుతున్నారు. స్టాక్ ట్రేడింగ్ అంటే ఏమిటీ..? అసలు స్టాక్ ట్రేడింగ్ ఎక్కడ చేస్తారు.? స్టాక ట్రేడింగ్ నిర్వహించే అసలైన ఏజెన్సీలు ఎన్ని ఉన్నాయి? అనే కనీస పరిజ్ఞానం లేకుండానే బాధితులు ట్రేడింగ్‌లోకి అడుగుపెడుతున్నారు.తెలంగాణ ప్రభుత్వ అప్పులు ట్రేడింగ్‌లో ఒకేసారి లక్షలు సాంపదించవచ్చనే భావనే బాధితులు మోసపోవడానికి ప్రధాన కారణంగా ఉంటుందని పోలీసులు పేర్కొంటున్నారు. వెయ్యి రూపాయల పెట్టుబడి పెట్టి తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని ట్రేడింగ్‌లోకి అడుగు పెడుతున్న బాధితులు వెయ్యి నుంచి పదివేలు, లక్షలు ఇలా దఫదఫాలుగా పెట్టుబడులు పెడుతూ సైబర్‌నేరగాళ్లు వేసిన వలలో చిక్కుకుంటున్నారు. ఇలా కొంత దూరం వెళ్లిన తరువాత తాము మోసపోతున్నామని తెలిసినా... దాని నుంచి వెనక్కి అడుగు వేయకుండా మరికొంత పెట్టుబడి పెడితే అప్పటి వరకు పెట్టిన పెట్టుబడి అంతా తిరిగి రాబట్టుకోవచ్చనే ఉద్దేశ్యంతో వేల నుంచి లక్షల్లో పెట్టుబడులు పెడుతూ చివరకు తమ ఆస్తులను సైతం అమ్మేసి సైబర్‌నేరగాళ్ల బ్యాంకు ఖాతాల్లో పోసేస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.

